



- అన్నదాతల్లో అకాల వర్షాల భయం
- జిల్లాలో 1.78 లక్షల ఎకరాల్లో వరి సాగు
- ధాన్యం సేకరణకు సన్నద్ధం.. 34 కేంద్రాలు ప్రారంభం
- జిల్లా వ్యాప్తంగా 238 కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- దిగుబడి అంచనా 3.67 లక్షల మెట్రిక్ టన్నులు

వరి కోతలు షురూ..

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

యాసంగిలో భారీగా అన్నదాతలు వరి సాగు వైపు మొగ్గు చూపారు. ఇంట్లో సిరు లు కురిపిస్తుందని ఎంతో ఆశపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగిలో 1.82 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా 1.78లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. పౌరసరఫరాల శాఖ ఒకవైపు కొనుగోలు కేంద్రాలు ప్రారం భిస్తూ ధాన్యం సేకరణకు సన్నద్ధం చేస్తు న్నారు. ఇదేక్రమంలో రైతులు హార్వెస్టర్లతో వేగంగా కోతలు ప్రారంభించారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వరికోతలు, కొనుగోలు కేంద్రాల సందడితో రైతులు బిజీబిజీగా మారిపోయారు.

● అకాల వర్షం.. దిగుబడి దిగాలు

యాసంగిలో రైతులు అనేక ఇబ్బందు లకు గురవుతూ వరి పంటను దక్కించు కునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో రోజురోజుకు నీటిమట్టాలు తగ్గిపో వడంతో చివరి దశలో వరి పంటను దక్కించుకోవడానికి ట్యాంకర్ల ద్వారా పొలా లకు నీటిని అందిస్తూ కాపాడుకుంటున్నా రు. బీటలు వారుతున్న పొలాలతో రైతులు ఆందోళన చెందుతున్న క్రమంలో అకాల వర్షాలు భయపెడుతున్నాయి. వడ గండ్ల వర్షాలు, దిగుబడిపై ప్రభావం చూపుతుం దని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో యాసంగిసాగు 1.82లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేసుకున్నారు. ఇందులో వరి 1.78 లక్షల ఎకరాలు, గోధుమ 109ఎకరాలు, జొన్నలు 3.13ఎకరాలు, మొక్క జొన్న 1975 ఎకరాలు, పెసర్లు 4324 ఎకరాలు, కందులు 300 ఎకరాలు, పల్లి 26ఎకరాలు, పొద్దు తిరుగుడు 350 ఎకరాలు సాగు చేశారు. పంటలు చేతికి వచ్చే దశ లో భూగర్భ జలాలు పడిపోయాయి. జిల్లాలో సరాసరి 11.27 మీటర్ల లోతుల్లోకి జలాలు పడి పోయాయి. మిడ్‌మానేరు ప్రాజెక్ట్‌లో 27.55 టీఎంసీల సామర్థ్యానికి 8.011 టీఎంసీలకు నీటి నిల్వలు పడిపోయాయి. జిల్లాలో మార్చినెలనాటికి బోయినపల్లిలో 8.17 మీటర్ల లోతులో నీటి నిల్వలు పడిపోగా, చందుర్తిలో 7.25, గంభీరావుపేటలో 12.90, ఇల్లంతకుంటలో 7.53, కోనరావుపేటలో 11.91, ముస్తాబాద్‌లో 13.42, రుద్రంగిలో 8.50, సిరిసిల్లలో 14.28, తంగళ్లపల్లిలో 9.88, వీర్నపల్లిలో 15.22, వేములవాడ రూరల్‌లో 5.84, వేములవాడ అర్బన్‌లో 16.52, ఎల్లారెడ్డిపేటలో17.84 మీటర్ల లోతు ల్లోకి భూగర్భజలాలు పడిపో యాయి.

● జిల్లాలో 238 కొనుగోలు కేంద్రాలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏప్రిల్ రెండవ వారం నుంచి ధాన్యం మార్కెట్‌కు వస్తుం దని అంచనాతో అందుకు అనుగుణంగానే కొనుగోళ్లు చేసే దిశగా అధికార యంత్రాం గం కొనుగోలు కేంద్రాలను ప్రారంభి స్తున్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, మార్కెట్ కమిటీ చైర్మన్లు ఇప్పటికే 34 కేంద్రాలు ప్రారంభించారు. ప్రభుత్వం నిర్ణ యించిన క్వింటాలుకు ధాన్యం ధర ఏ గ్రేడ్ రూ.2320, బి గ్రేడ్ రూ.2300 చొప్పున కొను గోలు చేయనున్నారు. జిల్లాలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని గ్రామాల్లోని రైతులకు అందుబాటులో ఉండే విధంగా కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేశారు. జిల్లా లో 260 గ్రామ పంచాయతీలు ఉండగా 238 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయను న్నారు. ఐకేపీ ద్వారా 191 కేంద్రాలు, సింగి ల్ విండోల ద్వారా 42కేంద్రాలు, డీసీఎం ఎస్ ద్వారా ఒక కేంద్రం, మెప్మా ద్వారా 4 కేంద్రాల ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు ఉపయోగించ డానికి గన్నీ బ్యాగులు కొత్తవి 18.70 లక్షలు, ఇప్పటికే ఉపయోగించినవి 15.90 లక్షలు అందుబాటులో ఉన్నా యి. కొనుగోళ్ల కోసం...

మిగతా 8లో

జిల్లాలో వరి సాగు(ఎకరాల్లో)..

మండలం	వరి
గంభీరావుపేట	18,000
ఇల్లంతకుంట	24,000
ముస్తాబాద్	20,000
సిరిసిల్ల	4,800
తంగళ్లపల్లి	19,000
వీర్నపల్లి	9,100
ఎల్లారెడ్డిపేట	16,850
బోయినపల్లి	12,500
చందుర్తి	16,000
కోనరావుపేట	17,800
రుద్రంగి	4,700
వేములవాడ	5,150
వేములవాడ రూరల్	10,450
మొత్తం	**1,78,350**

నేడు కేటీఆర్ పర్యటన

సిరిసిల్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు బుధవారం జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. మధ్యా హ్నం 12 గంటలకు సిరిసిల్లలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయ భవనంలో నిర్వ హించే హనుమాన్ పూజ, భిక్ష కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు గంభీరావుపేట మండల కేంద్రంలో పెద్దమ్మతల్లి దేవాలయాన్ని సంద ర్శిస్తారు. సాయంత్రం 5 గంటలకు కోనరావుపేట మండలం మల్కాపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవంలో పాల్గొంటారు.

రేపటి నుంచి ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పోపా ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మంగళవారం సిరిసిల్ల పద్మశాలి ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మామిడాల భూపతి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులను పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు సిద్ధం చేయడానికి పోపా ఆధ్వర్యంలో 30రోజులు ఉచిత శిక్షణ తరగతులను ఈనెల 10 నుండి ప్రతిరోజు సాయంత్రం 4గంటల నుంచి 6.30నిమిషాల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొ న్నారు. సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శిక్షణ తరగ తులు ఉంటాయని తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీ క్షలు రాసిన విద్యార్థులు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు సిద్ధం కావచ్చునని,ఆసక్తిగల విద్యార్థులు గూగుల్ షీట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

15న రెండు మండలాల్లో వాటర్ షెడ్ యాత్ర

- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట్ మండలాల్లో ఏప్రిల్ 15న వాటర్‌షెడ్ యాత్ర నిర్వహిస్తామని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కృషి సమాన్ యోజన 2.0లో భాగంగా వాటర్‌షెడ్ ప్రాముఖ్యతపై అవగాహన కార్య క్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగా ఏప్రి ల్ 15న ఉదయం ఎల్లారెడ్డి పేట మండలంలో ఉదయం 9.30 గంటలకు దేవుని గుట్టు తండా గ్రామంలో, మధ్యాహ్నం 2 గంటలకు గంభీరావుపేట మండలం మల్లా రెడ్డిపేట గ్రామంలో వాటర్ షెడ్ యాత్ర ఉంటుందని తెలిపారు. వాటర్ షెడ్ యాత్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో వాటర్ షెడ్ నిర్మాణ భూమి పూజ మొక్కల పెంపకం శ్రమదానం వంటి పలు కార్యక్రమాలు ఉంటాయని గ్రామీణ అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని విమర్శించడం సరికాదు



సిరిసిల్లలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో నేత కార్మికులను కరీంనగర్ ఎంపీ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పట్టించుకోవడం లేదంటూ కార్మిక సంఘాల నాయకులు విమర్శించడం సరైంది కాదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి గౌడ వాసు, జిల్లా చేనే త సెల్ కన్వీనర్ సుంచు ప్రకాష్‌లు ఖండించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మంగళ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వం అందించే వస్త్ర ఉత్పత్తులకు కార్మికులకు కూలీ నిర్ణయించడం లేదని ఆందోళనలు, సమ్మెలు చేపట్టడం సరైందే కానీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రభుత్వాన్ని నిందించకుండా బండి సంజయ్‌ను విమ ర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ చేనేత సెల్ అధ్యక్షుడు తవుటం రాజలింగం, గజ్జెల్లి అశోక్, వేముల సురేష్, కోడం శ్రీనివాస్, మేర్గు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గరుఢ వాహనంపై ఊరేగిన స్వామివారు..



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణ పూర్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు గరుడ వాహనంపై ఊరేగారు. ఉదయం ఆలయంలో పురోహితు లు వేణుగోపాలచారి, నవీన్‌చారి, మనోహరాచారిల ఆధ్వర్యంలో నిత్యహవనం, బలిహరణం, నివేదన, తీర్థగోష్ఠి, రథబలి, హోమం, తదితర కార్యక్రమాలను ని ర్వహించారు. దేవతామూర్తులను గరుడ వాహనంపై ప్రతిష్ఠి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. చిన్నారులు, యువతులు, మహిళల కోలాటల నడుమ స్వామివారు ముందుకు కదిలారు. హనుమాన్ దీక్షాపరులు భక్తిపర్యవశ్యంలో నృత్యాలుచేశారు. మహిళలు మంగళహారతులు సమర్పించి స్వామివారిని దర్శిం చుకున్నారు. రామనామ స్మరణతో గ్రామమంతా మార్మోగింది. మాజీ సర్పంచ్ నిమ్మ లక్ష్మీనారాయణరెడ్డి దంపతులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, నాయకు లు హన్మండ్లు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లిలోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మంగళవారం వేర్వే రుగా పంపిణీ చేశారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, బాబు, రాంరెడ్డి, గిరిధర్‌రెడ్డి, రాములు, బుచ్చాగౌడ్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, తిరుపతి, గోపాల్, రాజ్ కుమార్, కనకరాజు, చందు, రఫీక్, సురేశ్, నారాయణ, రమేశ్, దేవరెడ్డి, జబ్బర్, సత్యారెడ్డి, మనోహర్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిటీ జిల్లా జాయింట్ సెక్రెటరీగా బాబు

కోనరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా జాయింట్ సెక్రటరీగా మెరుగు బాబును నియమించినట్లు జిల్లా కమిటీ చైర్మన్ మిట్టపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బాబుకు నియామక పత్రాన్ని అందజేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చందుర్తి ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పౌష్టికా హారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు సంవత్సరాల పిల్లలలో పోషకాహారం లోపం నివారించడం, బరువు తగ్గడం, రక్తహీనత తదితర అంశాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో బ్లాక్ కోఆర్డినేటర్ రాజ్ కుమార్, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

'రాజన్న' ఆలయ విస్తరణకు శ్రీకారం

- 15న వేములవాడకు ఉన్నతాధికారుల రాక



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

7

రోడ్డు ప్రమాద బాధితులకు కలెక్టర్ చేయూత

- అంబులెన్స్‌కు సమాచారం.. జిల్లా ఆసుపత్రికి తరలింపు



ఫోన్‌లో అంబులెన్స్‌కు సమాచారం అందిస్తున్న కలెక్టర్

6

చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

గంభీరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ, ఆవిర్భావ దినోత్సవ వాల్‌పోస్టర్లను గంభీరావుపేటలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ రామాంజనేయులు, నాయకులు లింగంయాదవ్, గంద్యా డపు రాజు, వెంకట్‌యాదవ్, వహీద్, చెవులు మల్లేశం, బండ రమేష్, కిషోర్, నర్సింగరావు, నగేష్‌గౌడ్, శంకర్, ఆనందం తదితరులు ఉన్నారు.

గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల(సిరిసిల్ల)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న గిరిజన, గిరిజనేతర విద్యార్థినీలు కళాశాలలో అందుబాటులో ఉన్న బిఏ (హెచ్‌ఈపి), బిజెడ్‌సి ఎంబిజెడ్‌సీ, బీకాం (జనరల్), బీకాం (సి ఏ), ఎంపీసీ, ఎంపీసీఎస్ గ్రూపులలో ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ సాగుతోందని పేర్కొన్నారు. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. కళాశాలలో విద్యార్థులకు ఎన్‌సీసీ, స్పోర్ట్స్ , ఎన్ఎస్ఎస్‌లలో అవకాశాలతో పాటు వృత్తి విద్యా కోర్సులు, ఉన్నత విద్య కోసం ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రవేశాల కోసం సెల్ నంబర్లు 9110585202, 9985607074, 9550267058కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

మూలమలుపు వద్ద తొలగిన చెట్ల కొమ్మలు..

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



మూలమలుపులో తొలగించిన చెట్ల కొమ్మలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పా పూర్ గ్రామ శివారులోని సత్తేపీరీల దర్గా సమీపంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై మూలమలుపు వద్ద ఉన్న చెట్ల పొదలు తొలగాయి. మూల మలుపు వద్ద చెట్ల పొదలు ఏపుగా పెరిగి ప్రమాదకరంగా ఉండడంతో ఇటీవల 'ఆంధ్రజ్యో తి'లో ప్రచురితమైన 'అసలే మూలమలుపులు.. ఆపై చెట్లపొదలు' అనే కథనా నికి అధికారులు స్పందించారు. మంగళవారం క్షేత్ర స్థాయిలో చెట్లను పరిశీలిం చారు. మూలమలుపు వద్ద రహదారి కనిపించకుండా ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించారు. రోడ్డు మూలమలుపు పక్కన ఉన్న చెట్లపొదలను తొల గించడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మహిళా సంఘాలకు ఎరువులు, విత్తనాల దుకాణాలు

- ప్రతి మండలంలో రెండు దుకాణాల ఏర్పాటుకు ప్రణాళికలు - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మహిళ సంఘాల ద్వారా ఎరువులు, విత్తనాల దుకాణాలు నిర్వహించడానికి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించా రు. మంగళవారం కలెక్టరేట్‌లో మహిళ సంఘాల ద్వారా, ఎరు వులు, విత్తనాలు, డీలర్‌షిప్ దుకాణాల ఏర్పాటుపై అధికారుల తో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని మహిళ సంఘాల్లో అర్హులైన వారిని గుర్తించి ఎరువులు, విత్తనాల దుకాణాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఎరువులు, విత్తనాల దుకాణాలు నడిపేవారికి బీఎస్సీ(అగ్రికల్చ ర్) డిగ్రీ, లేదా డిప్లొమా, సొంత గోడౌన్, అద్దెకు తీసుకున్న గో డౌన్‌లు, ఎరువులు, విత్తనాల లైసెన్స్ సర్టిఫికెట్ అవసరం ఉం టుందన్నారు. మహిళా సంఘాలకు ఎరువులు, విత్తనాల డీలర్ షిప్ దుకాణాల ఏర్పాటుకు అవసరమైన లైసెన్స్ కల్పించేందుకు చర్య లు తీసుకోవాలని అన్నారు. మహిళ సంఘం పూర్తి వివరాలు తీసుకొని వ్యవసాయ అధికారిని సంప్రదించాలన్నారు. జిల్లాలోని ప్రతి మండ లంలో రెండు ఎరువులు, విత్తనాల దుకాణాలను మహిళా సంఘాల ద్వారా ఏర్పాటయ్యేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. అవసరమై న గోదాంతో కూడిన భవనాలు అద్దెకు తీసుకోవాలని సూచించారు. మహిళా సంఘాల్లో అర్హత ఉన్న వారు ముందుకు వస్తే అవసరమైన లైసెన్స్‌లు, సర్టిఫికెట్‌లు వ్యవసాయ శాఖ అందిస్తుందన్నారు. రాబోయే పంట సీజన్‌ల ముందు ఈ షాప్‌ల ఏర్పాటుచేస్తే ఎరువుల కేటాయిం పు, ఎరువుల విక్రయం గురించి శిక్షణ అందిస్తామన్నారు. ఈ సమా వేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, డీఏవో అఫ్జల్ బేగం, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.



రోడ్డుపై అడ్డుగా ఉంచిన రాళ్లు

పొంచి ఉన్న ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఇటీవల సీసీ రహదారిని నిర్మిం చారు. ఫీటు ఎత్తులో ఆలయ రోడ్డు పనులను చేపట్టడం వల్ల ప్రధా నరహదారి రోడ్డు ఓవైపు కిందికైపోయి ప్రమాదకరంగా మారింది. ఆ రహదారి గుండా ప్రయాణించే వాహనదారులు గమనించకుండా వెళితే ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. ప్రమాదకరంగా ఉన్న రహదారి అంచున బండరాళ్లను ఉంచి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెండు రహ దారులు కలిసేచోట తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి..

- మహిళా సంఘాల ద్వారా 191 కొనుగోలు కేంద్రాలు.. - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



పోత్గల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ముస్తాబాద్ (గంభీరావుపేట), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. యా సంగి పంట కొనుగోలులో భాగంగా మహిళా సంఘాల ద్వారా 191 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ముస్తాబాద్ మండలంలోని గూడెం, నామాపూర్, పోత్గల్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ భీమ్యానాయక్‌తో కలిసి మంగళ వారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రారంభించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాల్లో మహిళా సంఘాలకు భాగస్వామ్యం కల్పించామన్నారు. యాసంగి సీజన్‌లో జిల్లా పరిధిలో మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యానికి మహిళా సంఘాల ద్వారా 191కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుం టున్నామన్నారు. వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 42, మెప్మా ద్వార 6, డీసీఎంఎస్ ద్వారా 1, మొత్తం 240 కొనుగోలు కేంద్రా లను ఏర్పాటుచేస్తున్న కలెక్టర్ వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతు లకు ఇబ్బంది లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించినట్టు తెలిపారు. వేసవి నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. చల్లని తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ ఉండేలా చూసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్ సంచులు, ప్యాడీక్లీనర్, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు అందు బాటులో పెట్టుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తలారి రాణి, డీఆర్‌డీవో శేషాద్రి, పౌర సరఫరాల అధికారి వసంతలక్ష్మి, పౌర సరఫరాల మేనేజర్ రజిత, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో బీరయ్య తదితరులు ఉన్నారు.

ప్రాణం తీసిన క్రికెట్ బాల్

- చికిత్స పొందుతూ బాలుడి మృతి


అశ్విత్‌రెడ్డి(ఫైల్)

వేములవాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బాల్ తగిలి గాయపడిన సంఘటనలో వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ ప్రాంతానికి చెందిన దారం అశ్విత్‌రెడ్డి(9) అనే బాలుడు మృతిచెందాడు. గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామానికి చెందిన దారం శ్రీనివాస్‌రెడ్డి వేములవాడ పట్టణం లోని కోరుట్ల బస్టాండ్‌లో మందుల దుకాణం నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శ్రీనివాస్‌రెడ్డికి కుమారుడు అశ్విత్‌రెడ్డితో పాటు ఒక కుమార్తె ఉంది. వేసవి సందర్భంగా ఒంటిపూట బడి కొనసాగుతున్న నేపథ్యంలో ఈనెల 3వ తేదీ గురువారం పాఠశాల అయిపోయిన తర్వాత అశ్విత్‌రెడ్డి స్నేహితులతో క్రికెట్ ఆడడానికి వెళ్లాడు. ఇంటికి తిరిగివచ్చి యథావిధిగా శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లాడు. తరగతి గదిలో ఉన్న సమయంలో తలనొప్పిగా ఉందని చెప్పడంతో తండ్రి శ్రీనివాస్‌రెడ్డికి పాఠశాల నిర్వాహకులు సమాచారం అందించారు. అశ్విత్‌రెడ్డిని తండ్రి డాక్టర్ వద్దకు తీసుకువెళ్లగా తలపై క్రికెట్ బాల్ తగిలిందని చెప్పినట్లు సమాచారం. తలలో తీవ్రగాయమై రక్తస్రావం అవుతున్నట్లుగా గుర్తించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఈ మేరకు బాలుడు అశ్విత్‌రెడ్డిని కరీంనగర్ తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో శుక్రవారం రాత్రి హైదరాబాద్ బంజారాహిల్స్ అపోలో ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు శస్త్రచికిత్స చేసినట్లు బంధువులు తెలిపారు. సోమవారం తిరిగి రెండో శస్త్రచికిత్స నిర్వహించగా మంగళవారం బ్రెయిన్‌డెడ్ అయి బాలుడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపినట్లు సమాచారం. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సరదాగా క్రికెట్ ఆడుకోవడానికి వెళ్లి బంతి తగిలి గాయపడిన తమ కుమారుడు మృత్యువాత పడడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

మోడల్ స్కూల్లో క్రీడా సామగ్రి చోరీ

గంగాధర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మోడల్ స్కూల్లో క్రీడా సామగ్రి చోరీకి గురైనట్లు ఎస్‌ఐ వంశీ క్రిష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 5న పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కెమెరాలను పరిశీలిస్తున్న క్రమంలో ఒక కెమెరా పనిచేయకపోవడంతో అక్కడికి వెళ్లి చూడగా కనిపించలేదు. పక్కనే ఉన్న క్రీడా రూంను పరిశీలించగా క్రికెట్ బ్యాట్లు, వికెట్లు, షటిల్ బ్యాట్లు, గడియారాలు చోరీకి గురైనట్లు తెలిపారు. చోరీకి గురైన క్రీడా వస్తువుల విలువ 15వేలు ఉంటుందని, ప్రిన్సిపాల్ పద్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మామిడాలపల్లిలో పుస్తెల తాడు..

వీణవంక, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడాలపల్లి గ్రామానికి చెందిన అరవకొండ సరమ్మకు చెందిన 2.5 తులాల పుస్తెలు తాడు గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వివరాల ప్రకారం సరమ్మ ఇంటి ముందు నిద్రిస్తుండగా తెల్లవారుజామున చూసుకునే సరికి పుస్తెలు తాడు మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించుకొని వెళ్లినట్లు తెలిపారు. సరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

వృద్ధుడి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడి మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తిరుమల్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపూర్ మండలం భీంపల్లి గ్రామానికి చెందిన సముద్రాల కొంరయ్య వృత్తిరీత్యా సుతారి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో తన ద్విచక్ర వాహనంపై తోకలపల్లి గ్రామ శివారులో రోడ్డు దాటుతుండగా ఓ కారు డ్రైవర్ వచ్చి ఢీకొట్టడంతో తలకు, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయ పడిన కొంరయ్యను స్థానికులు ఆటోలో హుజూరాబాద్ ప్రభుత్వా సుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆసుపత్రికి చేరుకొని మెరుగైన చికిత్స కోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడు కొంరయ్య సోదరుడి కుమారుడు సముద్రాల పవన్‌కల్యాణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

నకిలీ ధ్రువీకరణపత్రాల కేసులో యువకుడి అరెస్టు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నకిలీ వైద్య ధ్రువీకరణ పత్రం కేసులో మహమ్మద్ యూసుపుద్దీన్ (37) అనే యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం గాలిపెల్లి పశువైద్యశాలలో ఓఎస్‌గా పనిచేస్తున్న దేవమ్మ మెడికల్ ఇన్వాలిడేషన్ సర్టిఫికెట్ సమర్పించగా జిల్లా అధికారులు విచారణ జరిపి నకిలీపత్రాలు అని తేల్చారు. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేయగా మంగళవారం యూసుఫుద్దీన్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చెరువుల్లో చేపల పెంపకం

- గ్రామాల్లో ఉపాధి పొందుతున్న మత్స్యకారులు
- ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేయాలని వేడుకోలు
- చెరువులు, కుంటల్లో నీటిని నింపితే మరింత ఆదాయం


సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి పై చెరువులో పట్టిన చేపలు



సైదాపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చేపల పెంపకంతో గ్రామాల్లోని మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. ఒకప్పుడు చెరువుల్లో నీరు లేక చేపల పెంపకం ఆశాజనకంగా లేదు. గత కొన్ని సంవత్సరాల నుంచి వర్షాలు సమృద్ధిగా కురవడం, కాలువ ద్వారా నీరు అందుబాటులోకి రావడంతో చెరువుల్లోకి సమృద్ధిగా నీరు చేరుతోంది. దీనికి తోడు ప్రభుత్వం ఉచిత చేప పిల్లలు పంపిణీ చేయడంతో మత్స్యకారులు చెరువులు, కుంటలలో చేప పిల్లలు పోసి ఉపాధి పొందుతున్నారు. గత సంవత్సరం వర్షాలు సంవృద్ధిగా కురియడం వల్ల చెరువులలో నీరు ఎక్కువ కాలం ఉండడంతో చేపలు ఎక్కువ సైజు వరకు పెరిగి ఎక్కువ ఆదాయం వచ్చిందని మత్స్యకారులు చెపుతున్నారు. ఈ సంవత్సరం వర్షాకాలం ప్రారంభంలో కురిషిన వర్షాలు ఇప్పటి వరకు లేక పోవడం, ఆ వర్షాలకు చెరువులు పూర్తిగా నిండక పోవడంతో పాటు కాలువ నీరు కూడా అంతంత మాత్రంగా రావడం తో చెరువులు, కుంటల్లో నీరు అంతంత మాత్రంగా చేరింది. నీరు సమృద్ధిగా లేక చేపలు తక్కువ సైజు పెరిగాయని, సుమారు సగం వరకు ఆదాయం తగ్గిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఉచిత చేపపిల్లలు ఇవ్వక పోవడం కూడా ఆదాయం తగ్గుదలకు కారణమని తెలుపుతున్నారు. ప్రభుత్వం స్పందించి కాలువ నీళ్ల ద్వారా చెరువులు, కుంటలు నింపాలని కోరుతున్నారు. దీంతో మత్స్యకారుల కుటుంబాలు జీవనోపాధి పొందుతాయని మత్స్యకారులు పేర్కొంటున్నారు. అలాగే చేప పిల్లలు కొనడానికే ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తున్నదని, ప్రభుత్వం 100 శాతం ఉచిత చేప పిల్లలను పంపిణీ చేసి మత్స్యకారులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

కాలువ నీళ్లతో చెరువులు నింపాలి

సైదాపూర్ మండలంలో 30 గ్రామ పంచాయతీలుండగా 17 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలున్నాయి. అందులో 2వేల మంది తమ్మ్యకార సభ్యత్వాలున్నాయి. సుమారు 2వేల పైన కుటుంబాలు చేపల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయి. అయితే సైదాపూర్ మండలానికి ఒక పక్క నుంచి కాకతీయ కెనాల్ ఉన్నది. కొంత భాగానికి మిడ్ మానేరు కాలువ ఉంది. మరికొన్ని గ్రామాలకు గౌరవెల్లి కాలువ వస్తుంది. ప్రభుత్వం ప్రతి సంవత్సరం కాలువ నీళ్లు సమృద్ధిగా వదిలితే సైదాపూర్ మండలంలో చెరువులు, కుంటలు పూర్తిగా నిండే అవకాశం ఉన్నది. మరోవైపు అన్ని గ్రామాల్లో ప్రతి యేటా ఉచిత చేప పిల్లలను అందించాలని మత్స్యకారులు కోరుతున్నారు.



ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాలి

పెసరు కుమారస్వామి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు



ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా కాలువల ద్వారా ఆయా ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపాలి. దీనితో పాటు ఉచిత చేపపిల్లలు పంపిణీ చేయాలి. ప్రతి గ్రామంలో మత్స్యకార కుటుంబాలు చేపల పెం`ఏకంపై ఆధారపడి జీవిస్తున్నాయి. చెరువులు, కుంటలు నింపడం వల్ల మత్స్యకారు లకు చేతి నిండా పని దొరికి ఆర్థి కంగా అబివృద్ధి చేందే అవకాశ ముంది. ప్రభుత్వం మత్స్య పారిశ్రామిక సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

వేములవాడ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి నందికమాన్ సమీపంలో గుర్తుతెలియని వృదురాలు మృతదేహం లభ్యమైనట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. నందికమాన్ సమీపంలోని రోడ్డు పక్కన సుమారు 60 సంవత్సరాల వయస్సుగల, పసుపు పచ్చ చీర, ఎరుపు రంగు జాకెట్ కలిగిన వృద్ధురాలి మృతదేహం ఉన్నట్లు గుర్తించమన్నారు. సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేసి మార్చూరీకి తరలించినట్లు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిస్తే వేములవాడ టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

కలప పట్టివేత

కొడిమ్యాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని దమ్మయ్యపేట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను అటవీ అధికారులు పట్టుకున్నారు. అటవీ సిబ్బందికి అందిన పక్కా సమాచారం మేరకు సోమవారం రాత్రి అటవీ శాఖ రేంజర్ గులాం మొయినుద్దీన్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించి ట్రాక్టర్‌లో తరలిస్తున్న 35వేల రూపాయల విలువైన 44టేకు దుంగలను పట్టుకున్నారు. డిప్యూటీ రేంజర్ ముషీర్ అహ్మద్, దమ్మయ్యపేట బీట్ అధికారి అశ్విణి, బేస్ క్యాంప్ సభ్యులు ఉన్నారు.

బందోబస్తు మధ్య అంత్యక్రియలు

రుద్రంగి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఫుడ్ పాయిజన్‌తో మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన కాదాసు పుష్పలత, నిహాల్ తేజ్ అనే తల్లికొడుకుల మృతదేహాలు మంగళవారం రుద్రంగికి చేరుకున్నాయి. దీంతో బంధువులు రోదనలు మిన్నంటాయి. రుద్రంగిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్రంగి ఎస్‌ఐ సిరిసిల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ - సిరిసిల్ల జిల్లా కమిటీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి వెంటనే పీఆర్సీని అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదిమూలం వెంకట్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలుగా ట్రెజరీల్లో ఆమోదం పొంది కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న అన్నిబిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. రెండు సంవత్సరాలుగా సెలవు జీతాలు, సప్లమెంటరీ వేతనాలు, మెడికల్‌బిల్లులు జీపీఎఫ్, పెన్షన్ టీఎస్ జీఎల్ఐ తదితర బిల్లులు విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత సంవత్సరం మార్చి నుంచి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు గ్రాట్యూటీ, కమ్యూనిటేషన్ మొత్తాలను చెల్లించకపోవడం వల్ల పెన్షనర్లు ఇబ్బందులకు గురైతున్నారన్నారు. బకాయి పడిన ఐదు వాయిదాల డీఎలు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీవో 317 బాధితులకు న్యాయం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా పాత విధానాన్ని కొనసాగించడం విచారకరమన్నారు. జీవో 317ను సవరించి బాధితుందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దుచేయాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను అమలు చేయాలని, రాష్ట్రంలో అన్ని జిల్లాలకు డీఈవో పోస్టులకు, అన్ని మండలాలకు ఎంఈవోలను నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ దశల వారీగా ఉద్యమ కార్యాచరణను ప్రకటించిందని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రావు, కోశాధికారి అంబటి రమేష్, జిల్లా కార్యదర్శులు పాములస్వామి, అడేపు శివకుమార్, తిరపతి, కొత్వాల్ ప్రవీణ్, పోలాస మల్లేశం, కోటగిరి లక్ష్మణ్, మధుసూదన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కోరుట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన రంజిత (20) అనే వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఏసీగోస్ని గుట్ట ప్రాంతానికి చెందిన రంజిత పట్టణానికి చెందిన పవన్‌ను కొన్ని రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకొని అల్లమయ్య గుట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. మంగళవారం రోజు పవన్ తండ్రి అనారోగ్యానికి గురికాగా చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో రంజిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి బయటకు రాకపోవడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు ఇంట్లోకి వెళ్లి చూడగా రంజిత ఉరివేసుకొని ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి


సంధ్యారాణి (ఫైల్)

జైపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ శ్రీధ ర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన నడిగొట్టు సంధ్యారాణి(40) కుటుంబీకులతో కలిసి మంచిర్యాలలోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వచ్చింది, కారులో తిరిగి ఇంటికి వెళ్తుండగా ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద జైపూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న వాహనం కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన సంధ్యా రాణిని మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. సంధ్యారాణి భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

యువతిని లైంగికంగా వేధించిన వ్యక్తికి జైలు శిక్ష

కోల్‌సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యువతిని కులం పేరుతో దూషించి లైంగికంగా వేధించిన కేసులో గోదావరిఖని రాజీవ్‌నగర్‌కు చెందిన ఆవుల మల్లయ్యకు మంగళవారం కోర్టు ఏడాది జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధించినట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. 2017లో అడ్డగుంటపల్లిలో ఈ ఘటన జరిగిందన్నారు. ఈ కేసు కరీంనగర్‌లోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో విచారణ జరుగగా గోదావరిఖని కోర్టు ఏఎస్‌ఐ తిరుపతిరావు, కానిస్టేబుల్ మహేందర్ సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టారు. బాధితురాలి తరఫున ప్రభుత్వ న్యాయవాది రాములు నేరం నిరూపించారన్నారు. న్యాయమూర్తి నీరజ తీర్పు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. దోషికి శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బంది, పీపీ రాములును సీపీ అంబర్ కిశోర్ ఝా, డీసీపీ పుల్లా కరుణాకర్, ఏసీపీ రమేష్ అభినందించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఉపాధిహామీ కూలీలపై తేనెటీగల దాడి


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

మంథనిరూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజు లపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో కాలువ పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలపై మంగళవారం ఉదయం తేనెటీగలు దాడి చేశాయి. కాలువ పూడికతీతలో భాగంగా చెట్లను తొలగిస్తుండగా చెట్లపై ఉన్న తేనే తీగలు ఒక్కసారిగా లేచాయి. కూలీలు అక్కడి నుంచి వెళ్లిపోవటానికి ప్రయత్నిస్తుండగా అవి ఒక్కసారిగా దాడి చేయడంతో 11 మంది కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటనలో పేరం దుర్గయ్య, గంగుల స్వామి, తోగరి మల్లయ్య, వేల్పుల రాయలింగు, పేరం లక్ష్మి, నలోటి లక్ష్మి, తోగరి గౌరమ్మ, వేల్పుల లక్ష్మి, వేల్పుల బాను, గోస్కి ఎల్లమ్మ అనే కూలీలకు గాయాలయ్యాయి. వీరిని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. గాయపడిన ఉపాధిహామీ కూలీలను ప్రజా సంఘాల నాయకులు బూడిద గణేష్, ఆర్ల సందీప్, గొర్కెల సురేష్, మంథని లింగయ్యలు పరామర్శించారు. గాయపడ్డ కూలీలకు మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లను వారు కోరారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

బీర్‌పూర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యా యత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందిందని ఎస్సై కుమారస్వామి తెలిపారు. బీర్‌పూర్ మండలం రేకులపల్లి గ్రామానికి చెందిన పసుల గంగవ్వ(26)కు రెండు సంవత్సరాల క్రితం తన బావ అయిన తాటిపల్లి మహేందర్‌తో రెండో వివాహం జరిగింది. వివాహం జరిగిన కొన్ని రోజుల తరువాత జీవనోపాధి నిమిత్తం ముంబాయికి వెళ్లారు. అక్కడ గంగవ్వ కడుపు నొప్పితో బాధపడడంతో స్వగ్రామానికి వచ్చింది.

అయినా నయం కాకపోవడంతో గత నెల 21న క్రిమిసం హారక మందు తాగింది. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం చికిత్స పొందుతూ గంగవ్వ మృతి చెందింది. మృతురాలు గంగవ్వ తండ్రి లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులకు కలెక్టర్ చేయూత


క్షతగాత్రుడితో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రెండో బైపాస్ రోడ్డులో మంగళ వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరికి కలెక్టర్ చేయూత నందించారు. గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. చంద్రంపేట శివారులోని రెండో బైపాస్ రోడ్డు జంక్షన్‌లో బైక్, కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యు వకులు గాయపడ్డారు. అదే సమయంలో అధి కార పర్యటన నిమిత్తం వెళ్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంఘటనను చూసి తన వాహనాన్ని ఆపారు. గాయపడ్డ యువకులను పరామర్శించి అంబులెన్స్‌లకు సమాచారం అందించి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కోనరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గుడుంబాను ద్విచక్రవాహనంపై తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల-మరిమడ్ల రహదారిపై తనిఖీలు భాగంగా ఓ ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా 10 లీటర్ల నాటుసారా లభించిందన్నారు. సారాను, రవాణాకు వాడిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనపరుచుకొని తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

కాంగ్రెస్ జెండా గద్దె ధ్వంసం


జెండా గద్దెను పరిశీలిస్తున్న పోలీసులు

కోనరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెను సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. కాగా కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మట్టిమల్ల చేరుకొని ధ్వంసమైన కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెను పరిశీలించి సీసీ కెమెరా ఫుటేజ్ ద్వారా నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నామని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

చెంజర్లలో పూరిల్లు దగ్ధం

- కాలిబూడిదైన రూ. 1.50 లక్షలు, సామగ్రి

మానకొండూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెందజర్లలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఓ పూరిల్లు మంగళవారం దగ్ధమైంది. చెంజర్ల గ్రామానికి చెందిన గొల్లైన జ్యోతి-అశోక్ దంపతులకు ఇద్దరు కుమారులు చరణ్, అరవింద్ ఉన్నారు. జ్యోతి, అశోక్ గ్రామంలోని ఓ ప్రయివేటు కంపెనీలో పని చేస్తు ఇద్దరు పిల్లలను సాకుతున్నారు. మంగళవారం ఉదయం ఇంటిలో పూజ చేసి దీపం ముట్టించి ఎప్పటిలాగే పనులకు వెళ్లగా కుమారులు పాఠశాలకు వెళ్లారు. వారు వెళ్లిన కొద్ది సేపటికే ముట్టించిన దీపం సమీపంలోని బట్టలకు అంటుకొని పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. నూతన ఇంటి నిర్మాణానికి 1.50 లక్షల రూపాయలను అప్పు తెచ్చి బీరువాలో దాచాగా ప్రమాదంలో బీరువాలోని బట్టలతో పాటు నగదు, 50 కిలోల బియ్యం, వంట సామగ్రి, రెండు మంచాలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి.

సమాచారం అందుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాములు, రికార్డు అసిస్టెంట్ బాబుదేవ్ సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. పూరిల్లు దగ్ధం కావడంతో రోడ్డున పడ్డామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత దంపతులు కోరారు.


దగ్ధమైన పూరిల్లు వద్ద బాధితులు

ఇస్రో యువికాకు ముగ్గురు విద్యార్థినుల ఎంపిక

ఒకే పాఠశాల నుంచి ఇద్దరు



పి.సాత్విక, పి.సిరివెన్నెల, టి.సాయిహర్షిత

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ యేటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యువ శాస్త్రవేత్త కార్యక్రమానికి జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి మంగళవారం తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాగినేడుకు చెందిన భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు కె.జగదీశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో పోలవేణి సాత్విక, పడాల సిరివెన్నెల, పాలకుర్తి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కన్నాలకు చెందిన భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడు బి.రవీనందన్‌రావు మార్గదర్శనంలో తోడేటి సాయిహర్షిత ఎంపికయ్యారు. గతనెలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా ముగ్గురు యువికా 2025కు ఎంపికైనట్లు డీఈఓ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 28రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి వేలాది మంది 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు గత నెల 23వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్నారు. రాష్ట్రం నుంచి ఈసారి 12మంది విద్యార్థులు ఎంపిక కాగా ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన ముగ్గురు పెద్దపల్లి జిల్లాకు చెందిన వారు కావడం గమనార్హం. గతేడాది రాగినేడు ఉన్నత పాఠశాలకు చెందిన రంగు కీర్తన ఎంపిక కాగా ఈసారి అదే పాఠశాల నుంచి ఒకే తరగతికి చెందిన ఇరువురు ఎంపికయ్యారు. ముగ్గురు విద్యార్థులు మే నెలలో ఇస్రోకు చెందిన 7పరిశోధన కేంద్రాల్లో ఒకచోట అంతరిక్ష సాంకేతికత, అనువర్తనాలపై రెండువారాల ఆవాస శిక్షణా కార్యక్రమంలో పాల్గొనున్నట్లు డీఈవో తెలిపారు. జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థినులు శిక్షణకు ఎంపిక కావడంపై ఉపాధ్యాయ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఎంపికైన విద్యార్థినులను, గైడ్ టీచర్లను డీఈవో డి.మాధవితో పాటు డీఎస్ఓ సమగ్ర శిక్ష సమన్వయకర్తలు పీఎం.షేక్, సీహెచ్ మల్లేషగౌడ్, కవిత, అజీం, మండల విద్యాధికారులు టి.సురేంద్రకుమార్, టి.విమల, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ ఆగయ్య, జె.కమలాకర్‌రావు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో అభినందించారు.

సైనిక్ స్కూల్‌లో స్పేస్ ఆన్ వీల్స్ మొబైల్ ఎగ్జిబిషన్



స్పేస్ ఆన్ వీల్స్ ఎగ్జిబిషన్ బస్ వద్ద విద్యార్థులు

చొప్పదండి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మా పూర్ సాంఘిక సంక్షేమ సైనిక స్కూల్‌లో స్పేస్ ఆన్ వీల్స్ మొబైల్ బస్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. జిల్లాలో మొట్ట మొదటిసారిగా రుక్మాపూర్ సైనిక్ గురుకుల స్కూల్‌లో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతరిక్ష విజ్ఞానాన్ని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో తెలియజేయాలన్న లక్ష్యంతో ఎన్ఆర్ఎస్‌సీ సంస్థ స్పేస్ ఆన్ వీల్స్‌ను నిర్వహిస్తున్నారు. అంతరిక్ష విద్య, దాని అనుభవాలను సందర్శించడానికి తక్కువ అవకాశాలు ఉన్న గ్రామీణ పిల్లలకు అందించడం ఎగ్జిబిషన్ లక్ష్యం. ఈ ప్రత్యేక వాహనంలో ఉపగ్రహ నమూనాలు, లాంచ్ వెహికిల్స్ భారత అంతరిక్ష ప్రయోగాల విజయాలు, భవిష్యత్తు ప్రాజెక్టుల వివరాలు, అంతరిక్ష విజ్ఞాన సంబంధిత వీడియోలను విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఎస్‌సీ సైంటిస్టులు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, డాక్టర్ టి శంకర్ ప్రసాద్, స్కూల్ డైరెక్టర్ కల్నల్ కేసీరామావు,ప్రిన్సిపాల్ కాళహస్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులు ఇవ్వండి


కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన చేనేత కార్మికుడు, సామాజిక కార్యకర్త అలువాల రాములు కోరారు. కొత్త రేషన్‌కార్డు ఇవ్వాలని సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు నుంచి కరీంనగర్ కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. దారి పొడవునా ఆలయాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేషన్‌కార్డులు జారీ చేసేలా చూడాలని దేవుళ్లకు మొక్కారు. మంగళవారం కరీంనగర్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాములు కొత్త రేషన్‌కార్డు కోసం అనేక సార్లు దరఖాస్తు చేసుకొని విసిగిపోయాడు. తన మాదిరిగా ఎంతో మంది రేషన్‌కార్డులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకోలేక పోతున్నారని, కార్డులు వెంటనే జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరేందుకు పాదయాత్ర చేపట్టానని తెలిపారు. కొత్త రేషన్‌కార్డులు ఇప్పించి, సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని కోరారు.

10న ఉమ్మడి జిల్లా అండర్-19 బాక్సింగ్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న అంబేద్కర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా అండర్-19 మెన్ అండ్ ఉమెన్స్ బాక్సింగ్ ఎంపి క పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి గల బాక్సింగ్ క్రీడాకారులు ఉదయం 10 గంటలకు స్టేడియంలో ఒరిజినల్ ఆధార్‌కార్డు, ఒక పాస్ పోర్టు ఫొటోతో హాజరు కావాలని, వివరాలకు 9100668474 నంబరులో సంప్రదించాలని ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సెక్రెటరీ సంపత్ కుమార్ తెలిపారు.

అందుబాటులోకి ఎల్‌సీ యాప్

లైన్ క్లియర్ అనుమతి నుంచి రిటర్న్ వరకు యాప్‌లోనే



గణేశ్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు ఎన్పీడీసీఎల్ మరో యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆన్‌లైన్ ఎల్‌సీ (లైన్ క్లియర్) యాప్‌ను ప్రవేశ పెట్టింది. ఎల్‌సీ తీసుకుని పని చేసే సమయంలో మానవ తప్పిదాలు జరుగుతున్న నేపథ్యంలో నూతనంగా తీసుకొచ్చిన యాప్ వినియోగదారులకు.. ఇటు ఎన్పీడీసీఎల్ సిబ్బందికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. విద్యుత్ సరఫరాలో భద్రతా ప్రమాణాలను పెంచేందుకు, విద్యుత్ అంతరాయ సమయాలు, మానవ తప్పిదాలను నివారించేందుకు లైన్ క్లియర్ (ఎల్‌సీ) యాప్‌ను రూపొందించామని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేష్‌బాబు తెలిపారు.

యాప్ పని చేసే విధానం

విద్యుత్ సరఫరాలో ఎల్సీ తీసుకోవాలనుకున్న లైన్‌మన్ మొదట లైన్ క్లియర్ యాప్ ఓపెన్ చేయాలి. సంబంధిత ఫీడర్లో ఎల్‌సీ కావాలని ఏఈకి మెసేజ్ చేయాలి. ఏఈ లైన్‌మన్ పంపిన మెసేజ్‌ను పరిశీలించి ఆ ఫీడర్లో ఎల్‌సీ ఇవ్వొచ్చా.. లేదా అని, అత్యవసర అవసరాలు ఏమైనా ఉన్నాయా లేదా మరే ఇతర షెడ్యూల్ చేసిన పనులు ఉన్నాయా అని సమీక్షిస్తారు. దాని ప్రకారం ఎల్‌సీ ఇవ్వొచ్చు లేదా నిరాకరించవచ్చు.. ఏఈ ఎల్‌సీ అనుమతి ఇవ్వగానే సంబంధిత లైన్‌మన్‌కు సమాచారం అందుతుంది. సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఏ ఫీడర్‌కు ఎల్సీ ఇవ్వాలో యాప్ ద్వారా మెసేజ్ వస్తుంది.

సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఎల్‌సీ ఇవ్వాల్సిన సమయంలో పొరపాట్లు లేకుండా తగిన సూచనలు, జాగ్రత్తలు హెల్మెట్ పెట్టుకోవడం, హ్యాండ్ గ్లౌజ్ వేసుకోవడం, ఎర్తరాడ్ వాడాలని, ఏబీ స్విచ్ ఓపెన్ చేస్తారా లేదా అని యాప్ గుర్తుచేస్తుంది. వీటన్నింటిని సబ్‌స్టేషన్ ఆపరేటర్ చేసి ఫొటో తీసి యాప్ అప్లోడ్ చేస్తే ఆ ఫొటోను యాప్ ద్వారా లైన్‌మన్ చూసి.. ఆ ఫొటోలో కనిపిస్తున్న ఫీడర్, ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా.. లేదా.. అని ధ్రువీకరించుకుని పని ప్రారంభిస్తాడు. లైన్‌మన్ ఎంతమంది సిబ్బందితో పని చేయిస్తున్నాడో వారి పేర్లు యాప్‌లో పొందుపర్చాలి. పని పూర్తి కాగానే ఈ పనికి సంబంధించి ఫొటో, సిబ్బంది వచ్చారా.. లేదా అని యాప్‌లో పొందుపర్చి ఎల్‌సీని రిటర్న్ చేయాలి. సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు యాప్ ద్వారా ఎల్‌సీ రిటర్న్ చేయాలని ఆదేశాలు వెళ్తాయి. రిటర్న్ చేసిన ఎల్‌సీ సమాచారం ఏఈకి అందుతుంది. ఏఈ ఆదేశాల మేరకు ఆ ఫీడర్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు.

ప్రమాదాల నివారణ

విద్యుత్ లైన్ క్లియర్‌లో ఒక ఫీడర్ బదులు మరో ఫీడర్ను ఎంచుకోవడం, పంపిణీ వ్యవస్థ సరిగ్గా గుర్తు చేసుకోకపోవడం, సమాచార లోపం, తదితర కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బంది, ప్రైవేట్ ఎలక్ట్రిషియన్లు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వీటి నివారణ కోసం ఆన్‌లైన్ ఎల్‌సీ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. యాప్ ద్వారా మానవ తప్పిదాలను పూర్తిగా నివారించొచ్చు. అనవసరమైన ఎల్‌సీలు తగ్గించొచ్చు. ఎల్‌సీల సమయాలను గణనీయంగా తగ్గించడమే కాకుండా ఎల్‌సీ తీసుకున్న సమాచారం పైఅధికారులకు వెంటనే తెలిసి పోతుంది. సంబంధిత ఏఈ అనుమతి లేకుండా తీసుకునే ఎల్‌సీలను ఈ యాప్ ద్వారా నివారించొచ్చు.

N⚡D TSNPDCL

ముగ్గురికి జీవిత ఖైదు

కరీంనగర్‌లీగల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యువకుడి ఆత్మహత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు, రూ. 2వేల చొప్పున జరిమానా విధిస్తూ కరీంనగర్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నీరజ మంగళవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రామగుండం మండలం మల్రిపల్లికి చెందిన గూండా శంకరయ్య తన కూతురును ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశాడని అదే గ్రామంలోని ఎస్సీ కులానికి చెందిన దొబ్బల పవన్(21)పై కేసు పెట్టాడు. ఆ కేసులో పవన్ జైలుకు వెళ్లి వచ్చాడు. కొన్నాళ్లకు పవన్‌కు వేరే అమ్మాయితో పెళ్లి సంబంధం కుదిరింది. ఈ విషయం తెలిసి 2016 ఆగస్టు 21 మధ్యాహ్నం పవన్ తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్తుండగా గూండా శంకరయ్య, అకినపల్లికి చెందిన మండే శ్రీనివాస్, ఎగ్లాస్పూర్‌కు చెందిన క్యాతం రవీందర్ అడ్డుకున్నారు. బూతులు తిట్టి చనిపో అంటూ అవమానపరిచారు. దీంతో ఇంటికి వచ్చిన పవన్ జరిగిన విషయాన్ని తన తమ్ముడికి చెప్పి రూంలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా చనిపోయాడు. ఈ సంఘటనపై పవన్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో రామగుండం పోలీసులు గుండా శంకరయ్య (40), మెండే శ్రీనివాస్(35) క్యాతం రవీందర్(55)పై కేసు నమోదు చేశారు. సాక్ష్యాధారాల పరిశీలించిన న్యాయమూర్తి నిందితులు ముగ్గురికి జీవిత ఖైదు విధించారు.

'రాజన్న' ఆలయ విస్తరణకు శ్రీకారం

- 15న వేములవాడకు ఉన్నత అధికారుల రాక
- సమీక్షించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రిత్వ కార్యదర్శి శైలజ రామయ్యార్



మ్యాపులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రిత్వ కార్యదర్శి శైలజరామయ్యార్

సిరిసిల్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన పనులపై మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధ్యక్షతన దేవాదాయ శాఖ మంత్రిత్వ కార్యదర్శి శైలజరామ య్యార్, ఓఎస్‌డీ సోమరాజులు, కమిషనర్ శ్రీధర్ సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం విస్తరణ పనులపై చర్చించారు. ఈనెల 15న దేవాదాయ శాఖ కమిషనర్ ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి వేముల వాడలో పర్యటించాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయి పర్యటన చేసి మరోసారి శృంగేరీ పీఠం వారి వద్దకు వెళ్లాలని నిర్ణయించారు. ఈసందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్కిటెక్‌తో తయారు చేయించిన ఆలయ విస్తరణ పనులకు సంబంధించిన నమూనా లను పరిశీలించి కొన్ని మార్పులుచేర్పులు చేసి రెండు రోజుల్లోగా చివరి ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. ఆర్అండ్‌బీ శాఖ, దేవాదాయ శాఖ అధికారులతో కమిటీ వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీలోపు పీఠాధిపతి సూచనలు తీసుకొని 21న టెండర్ ప్రక్రియ చేపట్టడానికి ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

యోగానంద లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

జూలపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ శివారులోని శ్రీయోగానందా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం మంగళవారం గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా ముత్యాల పందిరిని ఏర్పాటుచేసి రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. సన్నాయి మేళతాళాల మధ్య అర్చకులు స్వామి వారల పెళ్లితంతును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి కల్యాణ వేడుకలను చూసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కల్యాణోత్సవంలో భక్తులు ఆలపించిన గోవింద నామాలు మారుమోగాయి. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం చలువ పందిరి, తాగునీరు, అన్న ప్రసాదం, పలు సౌకర్యాలను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. గొట్టిముక్కుల రజనీ, రవిందర్‌రెడ్డి, గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి, సీపెల్లిగోపాలక్రిష్ణ, సంకెండ్ల లక్ష్మి రాజం, సీపెల్లి అంజి, బొజ్జ సంపత్, మద్దెల నరేష్, కొండపెల్లి క్రిష్ణమూర్తి, గుండు కరుణాకర్, బాలక్రిష్ణ భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్క ర్స్ (ఎస్‌డబ్ల్యూయూ) ఐఎన్‌టీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జక్కుల మల్లేశంగౌడ్ అన్నారు. మంగళవారం నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీ సమ్మెకు ఇది సరైన సమయం కాదని, సంస్థలోని మిగతా సంఘాలను కలుపుకొని వెళ్లాలని అన్నారు. సమ్మెపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు చొరవ చూపాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కార్మికులకు పీఆర్సీ 21శాతం అందించిందన్నారు. రావాల్సిన బాండ్ డబ్బులతోపాటు, డీఏ అందించారన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దశల వారీగా పరిష్కరిస్తుందన్నారు. మహాలక్ష్మి పథకంతో పెరిగిన పనిభారాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాల న్నారు. బ్రీత్ అనలైజింగ్ టెస్టుల్లో వస్తున్న దానికనుగుణంగా కార్మికులను తొలగిస్తున్నారని, బీపీ, షుగర్ మందులతో బ్రీత్ టెస్టుల్లో పర్సెం టేజీలు అధికంగా వస్తున్న విషయాన్ని గమనించి కార్మికులకు వెసులుబాటు కల్పించాలన్నారు. ఆర్టీసీ లాభాల బాటలో ఉన్నందున మొదటి తేదీన జీతాలు ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలపై స్పందించాలని, లేని పక్షంలో సమ్మెపై తమ సంఘం కూడా ఆలోచన చేయాల్సి వస్తుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజు, రీజినల్ సెక్రెటరీ టీఆర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జక్కుల మల్లేశంగౌడ్

కుటుంబ కలహాలతో ముగ్గురికి కత్తిపోట్లు

బాధితుల్లో మూడేళ్ల బాలుడు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో కుటుంబ కలహాలతో ముగ్గురు కత్తిపోట్లకు గురయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం.. శాంతినగర్‌కు చెందిన కళికోట వెంకటేశ్, అతడి అన్న కొడుకు పృథ్వీ మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం వెంకటేశ్ అన్న కొడుకు పృథ్వీ, సాయి, మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కలిసి వెంకటేశ్- ఏంజెల్ దంపతులు, వారి కొడుకు శివనేత్ర(3)లపై కత్తులతో దాడిచేయడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఇందులో శివనేత్ర పరిస్థితి విషమంగా ఉంది. ఏంజెల్‌కు తీవ్ర గాయాలు కాగా, వెంకటేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పరిస్థితి విషమించడంతో బాలుడు శివనేత్రను హైదరాబాద్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పృథ్వీ, సాయిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. కాగా, గతంలో పృథ్వీ అనే వ్యక్తిపై తాను పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితుడు వెంకటేశ్ మీడియా ఎదుట తన బాధను వ్యక్తం చేశాడు. పోలీసులు పట్టించుకుంటే ఈ సంఘటన జరిగేది కాదని వెంకటేశ్ పేర్కొన్నాడు. తనపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరాడు. కాగా, పోలీసులు స్పందించలేదని వెంకటేశ్ పేర్కొనడం అవాస్తమని సీఐ తెలిపారు.

కాంగ్రెస్‌తో కలిసి పనిచేయకూడదా?

జీవన్‌రెడ్డి టీడీపీ నుంచి వచ్చిన వలస నాయకుడే

అసహనపు మాటలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కోసం కాంగ్రెస్‌తో కలిసి పనిచేయకూడదా అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి టీడీపీ నుంచి కాంగ్రెస్‌కు వచ్చిన వలస నాయకుడేనని, తనపై చేసిన అసహనపు మాటలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో మంగళవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ విలేకర్లతో మాట్లాడారు. తనపై మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఘాటుగా స్పందించారు. ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని తాను కాంగ్రెస్‌లో చేరి సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేస్తున్నానని అన్నారు.

సోమవారం సారంగాపూర్ మండలంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాధికారం కోసమే కాంగ్రెస్ ముసుగులో బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లోకి వస్తున్నారని పరోక్షంగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను విమర్శించారు. దీనిపై సంజయ్ కుమార్ స్పందిస్తూ తనపై జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి జీవన్‌రెడ్డి ఎంతోమందిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని సంజయ్‌కుమార్ గుర్తుచేశారు. మీరు పార్టీలో చేర్చుకుంటే లేని తప్పు, నేను కాంగ్రెస్‌లో చేరితే ఎలా తప్పు అవు తుందని జీవన్‌రెడ్డిని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రశ్నించారు. జగిత్యాల ప్రజలకు ఎవరు వలస వచ్చిన నాయకుడో తెలుసునని అన్నారు. తాను చేసిన అభివృద్ధితోనే రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందానని ఎమ్మెల్యే అన్నారు. సీనియర్ నాయకుడిగా జీవన్‌రెడ్డిని గౌరవిస్తానని, తన గౌరవాన్ని కాపాడుకుంటే మంచిదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సూచించారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించండి

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్



కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న నేతకార్మికుల సమస్యలను పరి ష్కరించాలని తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ కోరారు. ఈ మేరకు ఆయన కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి చేనేత కార్మికుల సమస్యలను వివరించారు. వాటిని పరిష్క రించేందుకు కేంద్ర జౌళిశాఖ మంత్రి అపాయింట్‌మెంట్ ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సంజయ్ చేనేత కార్మికుల సంక్షేమం, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, ఢిల్లీకి వస్తే తప్పకుండా కేంద్రజౌళిశాఖ మంత్రి అపాయింట్‌మెంట్ ఇప్పించి, పరిష్కారానికి సహకరిస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి సాను కూలంగా ఉందని చెప్పినట్లు వీరమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎలిగేటి శ్రీనివాస్, మహిళా విభాగం కోశాధికారి భీమనాతి శారద పాల్గొన్నారు.అనంతరం కేంద్రమంత్రి బండి సంజయ్‌ని శాలువతో సత్కరించారు.



ఆలయ ఆవరణలో భక్తులు

కొండగట్టులో భక్తుల రద్దీ

వేలాదిగా అంజన్నను దర్శించుకున్న దీక్షాపరులు

మల్యాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. కాగ హనుమాన్ చిన్న జయంతి సమీపిస్తుండడంతో వేలాదిగా సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న అంజన్న దీక్షాపరులు వేకువజామునే స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చు కున్నారు. ఇరవై వేలకు పైగా స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం, పార్కింగ్ ప్రదేశం నిండిపోయాయి.

బద్ది పోచమ్మకు బోనాలు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పాడి పంటలు, పిల్లాపాపలను చల్లగా చూడమ్మ బద్ది పోచమ్మ తల్లీ.. అంటూ భక్తులు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ బద్దిపోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. భక్తులు అమ్మవారికి మట్టికుండలో నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు.



క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి..

లక్ష్మీనారాయణ, ఎంపీడీవో, తంగళ్లపల్లి



ఆంధ్రజ్యోతి: ఎల్‌ఆర్ఎస్, ఇంటిపన్నుల వసూళ్లు అవుతున్నాయా..?

ఎంపీడీవో: ఎల్‌ఆర్ఎస్, ఇంటిపన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. పన్నుల వసూళ్లపై కార్యదర్శులతో నిత్యం సమీక్ష నిర్వహిస్తున్నాం. ఎల్‌ఆర్ఎస్ పన్ను సుమారు 60శాతం వరకు వసూలుకాగా, ఇంటి పన్నులు 80శాతం వసూలు చేశాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎంపీడీవో: తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి బోరుబావుల ద్వారా నీటిని అందించాడానికి చర్యలు తీసుకున్నాం. దేశాయిపల్లె, నర్సింహులపల్లె, ఎడ్లవానికుంటలో తాగానీటి ఎద్దడి ఉన్నట్లు గుర్తించి చర్యలు చేపట్టాం.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ పథకాల దరఖాస్తుల స్వీకరణ ఎలా సాగుతోంది?

ఎంపీడీవో: ప్రభుత్వ పథకాలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటుచేస్తున్నాం. ప్రస్తుతం యువ వికాస్ దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. కార్యాలయంలో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం.

- తంగళ్లపల్లి (ఆంధ్రజ్యోతి)

మున్సిపల్ పార్కులో వసతులు కరువు

- ఇబ్బందులకు తప్పని ప్రజలు
- పట్టించుకోని అధికారులు



వేములవాడ మండల పరిషత్ ఆవరణలోని మున్సిపల్ పార్కు


పార్కులో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహం

వేములవాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్మించిన మున్సిపల్ పార్కులో కనీస వసతులు కరువయ్యాయి. దాదాపు రెండు కోట్ల రూపాయల వ్యయంతో మున్సిపల్ పార్కును గత సంవత్సరం అందంగా తీర్చిదిద్దారు. గత మున్సిపల్ పాలకవర్గం ప్రత్యేక చొరవ తీసుకొని మండల పరిషత్ ఆవరణలో పార్కు నిర్మాణానికి కృషి చేశారు. పార్కులో చిన్నపిల్లలు ఆడుకోవడానికి వీలుగా థీమ్ పార్క్ తరహాలో అనేక రకాల వస్తువులను, వివిధ రకాల జంతువుల ఆకృతులతో కూడిన బెంచీలను ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం, సాయంత్రం పెద్ద సంఖ్యలో స్థానికులు పార్కుకు తరలివస్తున్నారు. అయితే పార్కులో కనీస సౌకర్యాలు కల్పించడంపై అధికారులు దృష్టి సారించలేదు. పార్కుకు వచ్చిన వారికి తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు లేకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో చిన్నపిల్లలతో వస్తున్న తల్లిదండ్రులు మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పార్కు చుట్టూ వాకింగ్ చేస్తున్నవారు విద్యుత్ దీపాలను మరికొన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కు సమీపంలో మరుగుదొడ్లు, పార్కు చుట్టూ మరిన్ని విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, పార్కుకు వచ్చేవారి దాహార్తి తీర్చే విధంగా తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కనీస వసతులు కల్పించాలి

- అలివేలి రాజేందర్, స్థానికుడు



కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మున్సిపల్ పార్కులో కనీస వసతులు కల్పించడంపై అధికారులు దృష్టిసారించాలి. ముఖ్యంగా మరుగుదొడ్లు లేకపోవడంతో చిన్న పిల్లలతో వచ్చే తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. పార్కు ఆవరణలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు వాకింగ్ ట్రాక్ చుట్టూ మరిన్ని విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి.

మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం

- అన్వేష్, మున్సిపల్ కమిషనర్



మున్సిపల్ పార్కు సమీపంలో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని మండల పరిషత్ అధికారులను సంప్రదించాం. ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా కొంత ఆలస్యం జరిగింది. వీలైనంత త్వరలో మరుగుదొడ్లు నిర్మించడంతోపాటు పార్కు ఆవరణలో తాగునీటి సౌకర్యం అందుబాటులోకి తీసుకువస్తాం.

వరి కోతలు షురూ..

(5వ పేజీ తరువాయి)

టార్పాలిన్లు, ఇన్నోవింగ్ మిషన్లు, పాడీ క్లీనర్‌లు, మాయిశ్చరైజ్ మీటర్లు, వేయింగ్ మిషన్లు, అస్క్ రిమూవర్స్ వంటి పరికరాలు అందుబాటులో ఉంచారు.

● పౌరసరఫరాల ద్వారా 3 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం

రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి సీజనల్‌లో 1.78 లక్షల వరి సాగు ద్వారా 3.67 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. 2.92 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం, 8 వేల మెట్రిక్ టన్నులు సన్నరకం ధాన్యం వస్తుందని అంచనా వేశారు. ఇందులో 67 వేల మెట్రిక్ టన్నులు మిల్లర్లు నేరుగా కొనుగోలు చేస్తారని అంచనా వేశారు. పౌర సరఫరాల శాఖ ద్వారా 3 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల రెండవ వారంలో లక్ష మెట్రిక్ టన్నులు, మేలో 1.88 లక్షల మెట్రిక్ టన్నులు, జూన్‌లో 79 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌లోకి వస్తుందని అంచనాలు వేశారు. ఇందులో పౌరసరఫరాల శాఖ ఏప్రిల్‌లో 75 వేలు, మేలో 1.68 లక్షలు, జూన్‌లో 63 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపు..


మరమ్మతు పనులు చేపట్టిన అధికారులు

చందుర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మూడపెల్లి గ్రామ శివారులోని వేంకటేశ్వరస్వామి ఆలయ వెనుక భాగంలో స్థలంలోని మిషన్ భగీరథ పైప్‌లైన్ ఓ వ్యక్తి బోర్ వేయించడం పైప్ పగిలిపోయింది. దీంతో చందుర్తి మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు నిలిచిపోయింది. ఆర్‌డబ్ల్యూఎస్ సంఘటన స్థలం చేరుకొని పైప్‌లైన్‌కు మరమ్మతు పనులను చేపట్టారు.

మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి


నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముస్కానిపేట గ్రామానికి చెందిన కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం నియాయక పత్రాన్ని అందించారు. గతంలో మండల శాఖ అధ్యక్షుడిగా పనిచేసిన రాఘవరెడ్డి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి పాటుపడతానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషిచేస్తానని పేర్కొన్నారు.

పెద్దమ్మతల్లి ఉత్సవాలకు రావాలని ఆహ్వానం

గంభీరావుపేట, ఎప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలో ఈనెల 9 నుంచి జరిగే పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణ మహోత్సవానికి రావాలని నాఫ్స్‌కాప్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావుకు మంగళవారం స్థానిక ముదిరాజ్ సంఘ నాయకులు ఆహ్వాన పత్రిక అందజేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు తప్పకుండా రావాలని రవీందర్‌రావును ముదిరాజ్ సంఘం నాయకులు ఆహ్వానించారు. రవీందర్‌రావును కలిసిన వారిలో ముదిరాజ్ సంఘం నాయకులు శివయ్య, దేవేందర్, పిట్ల బాబు, సంజీవ్ తదితరులు ఉన్నారు.

నియామకం

చందుర్తి, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం ఎన్‌హెచ్‌ఆర్‌సి చైర్మన్‌గా మర్రి రాజు నియమించినట్లు జిల్లా ఎన్‌హెచ్‌ఆర్‌సి చైర్మన్ మిట్టపల్లి శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ చింతలపల్లి అనిల్‌లు ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. రాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో చైర్మన్‌గా నియమించినందుకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ప్రత్యేకత కృతజ్ఞతలు తెలిపారు.

రాజీవ్ యువ వికాసానికి అవకాశం కల్పించాలి

- బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్

వీర్నపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా వీర్నపల్లి మండలంలోని ఉమ్మడి అడవిపదిర, గర్జనపల్లి, వన్‌పల్లి గ్రామాల ప్రజలకు యూనియన్ బ్యాంక్ కోనరావుపేట బ్రాంచ్ సెలెక్ట్ చేసుకునే ఆప్షన్ లేకపోవడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు నష్టపోయే పరిస్థితి ఉందని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ కోరారు. గత ఎన్నో ఏళ్లుగా ఈ మూడు గ్రామాలకు సర్వీస్ బ్యాంక్ గా యూనియన్ బ్యాంక్ కోనరావుపేట ద్వారా ఎన్నో సేవలు ఇక్కడి ప్రజలు పొందారు అని అన్నారు. గతంలో ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ, మరియు రైతు పంట రుణాలు, మహిళా సంఘాల రుణాలు కూడా ఇచ్చిన దాఖలు ఉన్నాయి. కేవలం మండలంకు కెడిసిసిబి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మాత్రమే ఉండడం మళ్ళీ సిరిసిల్లలో ఉన్న ఐసీఐసీఐ బ్యాంకు ఇవ్వడం వల్ల గతంలో బ్యాంకులతో అనుసంధానం ఉన్న బ్యాంకులు లేకపోవడం వల్ల నష్టపోయే ప్రమాదం ఉందని వాపోయారు. ఎక్కువ బ్యాంక్ లు ఇవ్వడం మూలంగా ఎక్కువ లబ్దిదారుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని కోరారు. ప్రభుత్వం పెద్ద మనసుతో ఆలోచించి సాఫ్ట్‌వేర్‌ను అప్డేట్ చేసి నిరుద్యోగ యువతి యువకులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎడెపెల్లి రవి, ఈసంపల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న సంస్కృతులపై అవగాహన పెంచుకోవాలి


విభిన్న వేషధారణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని విభిన్న సంస్కృతులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని మండల విద్యాధికారి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని కందికట్కూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి దశలోనే విభిన్నమైన భాషలు, సంస్కృతులు తెలుసుకోవడం ద్వారా భవిష్యత్తులో బాగా ఉపయోగపడుతుందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు తెలంగాణ, హర్యానలకు చెందిన భాషా పదాలు, వేషధారణలు, వంటకాలను ప్రదర్శించి పలువురి మన్ననలు పొందారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ నిర్మల, ఉపాధ్యాయుడు అనువేజు రాజులతో పాటు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని మార్గదర్శి పాఠశాల కరస్పాండెంట్ చిరంజీవి అన్నారు. కోనరావుపేట మండలం మర్తనపేట మార్గదర్శి పాఠశాలలో మంగళవారం ట్రెడిషనల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పురాతన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సిరిసిల్లలో కత్తిపోట్ల కలకలం..

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో కత్తిపోట్లు కలకలం రేపాయి. ఇంటివద్ద ఉన్న రెండు ఫీట్ల దారి వివాదంలో బాబాయి కుటుంబంపై కత్తులతో దాడికి దిగాడు. సిరిసిల్ల శాంతినగర్‌కు చెందిన కలికోట వెంకటేష్ అనే వ్యక్తికి, అతడి అన్న కొడుకు పృథ్వికి కొన్ని రోజులుగా దారి విషయంలో వివాదం నెలకొంది. మంగళవారం సాయంత్రం పృథ్వి మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి వెంకటేశ్ కటుంబంపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. బాధితుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు పృథ్వి, సాయి, మరో ఇద్దరిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ కె. కృష్ణ తెలిపారు. ఈ సంఘటన సిరిసిల్లలో చర్చనీయాంశమైంది.

కార్పొరేషన్ చైర్మన్ పదవి రాలేదనే విమర్శలు..



సమావేశంలో మాట్లాడుతున్న బొప్ప దేవయ్య

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ పదవి రాలేదని అక్కసుతో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలని మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్నూరుకాపు సంఘాలలో అన్ని పార్టీల వారు ఉంటారని అన్నారు. ఒక పార్టీకి చెందిన వ్యక్తులు మున్నూరు కాపులకు ద్రోహం జరుగుతుందని రాజకీయ పార్టీలా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతాం అన్నవారు ముందుగా మున్నూరుకాపు కులం నుంచి మాట్లాడుతున్నారా ఒక రాజకీయ పార్టీ ప్రతినిధిగా మాట్లాడుతున్నారా తెలపాలని డిమాండ్ చేశారు. రాజకీయ పద్ధతిలో మాట్లాడితే కులం పేరు చెప్పకుండా ప్రతిపక్ష పార్టీ నాయకులా మాట్లాడాలని అన్నారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకుడు అంటూ రాష్ట్రంలోని మున్నూరుకాపులంతా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకులు అనడం సరికాదని, ఎందుకు, దేనికి వ్యతిరేకులో చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లలో మున్నూరుకాపుల వాటా ఎక్కువ ఉంటుందన్న లాజిక్ మరిచిపోయి మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ప్రకటించిందన్నారు. మున్నూరుకాపుల సింహగర్జన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వంపైకి పోరాటానికి వెళుతుండం ఏంటని ప్రశ్నించారు. మున్నూరుకాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొనిశెట్టి శంకర్, ఉపాధ్యక్షుడు దుమాల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి ఎర్రం మల్లయ్య, గౌరవ అధ్యక్షుడు నీలి శంకర్, జిల్లా నాయకులు భైరి ప్రభాకర్, కొడిమ్యాల వేణుగోపాల్, ఇప్పపూల లక్ష్మన్, రాజు, భూమేష్ పాల్గొన్నారు.


పోషణ లోప రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాను పోషణలోప రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ పిల్లల పోషణపై తీసుకోవలసిన చర్యలపై సీడీపీవో, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులతో కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది రోజువారి పనులను పరిశీలించాలని పేర్కొన్నారు. మీ కేంద్రాలకు వచ్చేవారికి ప్రభుత్వం నుంచి వచ్చే వాటిని సక్రమంగా అందించినప్పుడే పిల్లలలో మానసిక ఎదుగుదల, మొదటి 5సవంత్సరాలలో మానసిక, శారీరక ఎదుగుల ఉంటుందని, ఆరోగ్య సమస్యలను వచ్చేవాటిపై చర్యలు తీసుకోవాలని, పిల్లలకు అందించే బాలామృతం, కోడిగుడ్లు అందించడంలో నిర్లక్ష్యం వ్యవహరించరాదని సూచించారు. పిల్లల అనారోగ్యానికి గురికాకుండా చూడాలన్నారు. ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలని, కేంద్రాల ద్వారా ఇచ్చే సరుకులు వారు ఏ విధంగా వాడుతున్నారన్న విషయాలపై దృష్టి సారించాలని అన్నారు. మాల్‌న్యూట్రిషన్ ఇతర లైన్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, తెలియచేసారు. అంగన్‌వాడీ ఆయా నుంచి అధికారి వరకు అందరు ప్రతి పనిని బాధ్యతగా వ్యవహరించి కలిసికట్టుగా పనిచేసినప్పుడే శాఖాపరంగా అభివృద్ధిని సాధించగలుగుతామన్నారు. సిబ్బంది సక్రమంగా పని చేయని లేని యెడల వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు బాగా పనిచేస్తేనే డిపార్ట్‌మెంట్ ప్రగతిని సాధించగలుగుతామని అన్నారు. పోషణలోపం 0శాతంగా ఉన్నప్పుడే ప్రగతిలో వనం ఉన్నట్లుగా గుర్తించడం జరుగుతుందని, పర్యవేక్షణ సరిగా లేకపోడం, పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం లాంటివి లేకుండా చూడాలని, మీ కేంద్రం పరిధిలో పోషణ లోపం 0 శాతంగా ఉండేలా చూసులకోవాలని పేర్కొన్నారు. 50 నూతన అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులు తొరగా పూర్తి చేసి వాటిని వాడుకలోకి తీసుకొని రావాలని ఈఈ పీఆర్‌ని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఈ.ఈ. పీఆర్ సుదర్శన్‌రెడ్డి, సీడీపీవోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత అందరిదీ..


చందుర్తి మండలంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

చందుర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం బండపల్లి, ఎనగల్, జోగాపూర్ గ్రామాల్లో మంగళవారం జై బాబు, జై భీమ్, జై సంవిధాన్, పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతపంటి రామస్వామి, మాజీ జడ్పిటిసి సభ్యుడు నాగం కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, నాయకులు కటకం మల్లేశం, ముస్కు మల్లారెడ్డి, భీమరాజు కనకరాజు, న్యాత దాసు, గొట్టె ప్రభాకర్, ముస్కు ముకుందరెడ్డి, ఎన్గంటి శంకర్, లింగంపల్లి సత్తయ్య, ల్యాండె తిరుపతి, మ్యాకల గణేష్, మల్లేశం, లింగంపల్లి బాబు, బుర్ర వెంకటి, బాలు, శ్రీకాంత్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలి..


వీర్నపల్లి మండలంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

వీర్నపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర ర్యాలీ మద్దిమల్ల, బంజేరు గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతియాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు తంగళ్ళపల్లి మండలం జిల్లెల్లలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూత శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, డైరెక్టర్లు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు తిరుపతి యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు హరిలాల్ నాయక్, మాజీ సర్పంచ్ పాటి దినాకర్, సీనియర్ నాయకులు జడ్చర్ల నాగరాజు, గ్రామ శాఖ అధ్యక్షులు ఇస్తారి దేవయ్య, నక్క శ్రీనివాస్, తుడుం రవీందర్, లచ్చిరామ్ నాయక్, రాకేష్ గౌడ్, శివరామకృష్ణ, ప్యాట్ల మల్లయ్య, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జల్గం ప్రవీణ్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వైద్య శివప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్ చిలుక రమేష్, కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు లేదు..

కోనరావుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు ముకాస రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్యకు లేదని కోనరావుపేట మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కచ్చకాయల బాల్ రెడ్డి అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బీసీలకు లబ్ధి పొందే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిసి కులగణన చేపట్టారని అన్నారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ న్యాయం చేస్తే కొండ దేవయ్య విమర్శించడంలో అర్థం లేదని అన్నారు. కొండ దేవయ్య బీసీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. బీసీలను అడ్డం పెట్టుకొని కొండ దేవయ్య ప్రయోజనాలను పొందుతున్నారని ఆరోపించారు. అలాంటి వ్యక్తికి విమర్శించే హక్కు లేదని అన్నారు. ఈ సందర్భంగా కోనరావుపేట మండల బీసీ సంఘం నాయకులు దండు విష్ణు, సాసాల రాజారాం, సాసాల మల్లారెడ్డి, ఉప్పుల గంగయ్య, బాదినేని బాలరాజు, అపురం సురేష్, నారాయణ, మల్లయ్య, శ్రీనివాస్, అంజయ్య, నరేష్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

- మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప

తంగళ్లపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లి, తాడురు, పాపయ్యపల్లె, లక్ష్మీపూర్, చీర్లవంచ గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. రైతులకు లబ్ధి చేకూరాలని అన్ని గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, బాలు, ఏపీఎం చంద్రయ్య, జిల్లా సమైఖ్య నాయకురాలు, సీసీ, ఎస్ఆర్పీ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల నిరవధిక సమ్మె విరమణ

- 15 రోజుల్లో చీరల తయారీకి కూలి నిర్ణయం

- చేనేత జౌళి శాఖ జేడీ ఎన్‌రావు


సిరిసిల్లలో కార్మిక సంఘాల నాయకులతో చర్యలు జరుపుతున్న చేనేత జౌళిశాఖ అధికారులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లలో రాష్ట్ర ప్రభుత్వం తయారుచేయించే చీరలకు కూలి నిర్ణయించడం, పదిశాతం యారన్ సబ్సిడీని మరమగ్గాలతోపాటు అనుబంధ రంగాల కార్మికులకు అందించడం, పెండింగ్‌లో ఉన్న యారన్ సబ్సిడీని విడుదల చేస్తామని చేనేత జౌళిశాఖ జేడీ ఎన్వీ రావు హామీ ఇచ్చారు. దీంతో సిరిసిల్లలో వారంరోజులుగా చేపటిన నిరవధిక సమ్మెను తాత్కాలికంగా విరమణ చేస్తున్నామని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ మంగళవార ప్రకటించారు. సిరిసిల్లలో సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్‌యూనియన్ ఆధ్వర్యంలో నేతన్నలకు చీరల తయారీ కూలిని నిర్ణయించి సమస్యలను పరిష్కరించాలంటూ సిరిసిల్లలో నిరవధిక సమ్మెను చేపట్టారు. ప్రభుత్వ స్పందించకపోవడంతో పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం 24గంట దీక్షను చేపట్టారు. దీంతో స్పందించిన చేనేత జౌళిశాఖ అధికారులు మంగళవారం సిరిసిల్లకు చేరుకుని ఇందిరానగర్‌లోని ఏఎంసీ గోదాంలో కార్మిక సంఘం నాయకులతో చర్చలు జరిపారు. సమ్మె చేపట్టిన దానికి ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డిలు స్పందించి చేనేత జౌళిశాఖ కమిషనర్‌తో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కమిషనర్ ఆదేశాల మేరకు చేనేత జౌళి శాఖ జేడీ వెంకటేశ్వర్‌రావు, ఏడీ రాఘవరావులు చర్యలు జరిపి కార్మికుల డిమాండ్‌లను 15 రోజుల్లో పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా గతంలో కంటే కూలీ తగ్గించకుండా పదిశాతం యారన్ సబ్సిడీతో పాటు త్రిఫ్ట్ పథకం డబ్బులను కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని వర్కర్ టూ ఓనర్ పథకం అమలు అయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి యారన్ సబ్సిడీని కొనసాగిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించారు. ఈ చర్చల్లో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, ఉడుత రవి, మచ్చవేణు, నక్క దేవదాస్, గుండు రమేష్, బాసశ్రీధర్, ఎలిగేటి శ్రీనివాస్, బెజుగం సురేష్, బచ్చు సదానందం, భాస్క ర్ తదితరులు పాల్గొన్నారు.